సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



సైనికుడి కుటుంబానికి పట్టా

భీమవరం(ప్రకాశం చౌక్): యుద్ధంలో వీర మరణం పొందిన సిపాయి గంట్లా వీర వెంకట నాగ వర్ధన్ తల్లి గంట్ల వెంకటలక్ష్మికి ఇళ్ల పట్టాను కలెక్టర్ ప్రశాంతి అందచేశారు.



వైభవంగా తెప్పోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): ఉమాసోమేశ్వర జనార్ధన స్వామికి సోమవారం రాత్రి కన్నుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు.



ఉరుసు మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : హజరత్ సయ్యద్ నజీముల్లాషా ఖాదిరి దర్గా ఉరుసు ఉత్సవం సోమవారం నిర్వహించారు. గంధారాధన చేసి గులాబీ పూలతో అలంకరించారు.

మండలికి ముగ్గురు





సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, చిత్రంలో మంత్రి కారుమూరి



సీఎంతో ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే డీఎన్నార్

- ఏలూరు, పశ్చిమ నుంచి అవకాశం
- స్థానిక సంస్థల కోటా నుంచి కవురు, వంకా రవీంద్రనాథ్
- ఎమ్మెల్యే కోటా నుంచి జయమంగళ
- రెండు బీసీలకు, ఒకటి కాపులకు కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ వర్గాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: శాసన మండలిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కీలక ప్రాధాన్యం దక్కింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ముగ్గురిని ఎంపిక చేశారు. బడుగులకు రాజ్యాధికారం నిర్ణయం దిశగా అభ్యర్థుల్ని ఎంపిక చేశారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్థానిక సంస్థల కోటా నుంచి రెండు, ఎమ్మెల్యే కోటా నుంచి మరొకరికి స్థానం కల్పించారు. అందులో రెండు బీసీలకు, మరొకటి కాపు సామాజిక వర్గానికి కేటాయించారు. జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ సమన్వయకర్త, బీసీ నేత కవురు శ్రీనివాస్‌కు, ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా ఉన్న కాపు సామాజికవర్గ నేత వంకా రవీంద్రనాథ్‌కు స్థానిక సంస్థల కోటాలో అవకాశం కల్పించారు. శాసనసభ్యుల కోటా నుంచి మాజీ ఎమ్మెల్యే, బీసీ కీలక నేతగా ఉన్న జయమంగళ వెంకటరమణను అభ్యర్థిగా ప్రకటించారు. మరో రెండు రోజుల్లో కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రలు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మొదటిసారి బరిలో ముగ్గురు

ఉమ్మడి పశ్చిమగోదావరి చరిత్రలో మొదటిసారి ముగ్గురిని ఎన్నికల బరిలో నిలిపారు. 2014 వరకు ప్రతి పర్యాయం ఉమ్మడి జిల్లాకు రెండు స్థానాలు మాత్రమే దక్కాయి. మొదటి సారిగా జిల్లా చరిత్రలో బీసీలకు పట్టం కడుతూ శాసనమండలి కూర్పులో పెద్ద పీట వేశారు. జిల్లాలో శాసనమండలి సభ్యుల నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేశారు. ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రస్తుతం స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న టీడీపీ నేతలు అంగర రామ్మోహనరావు, మంతెన సత్యనారాయణరాజు పదవీకాలం ముగియనుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల ఎంపిక లాంఛనమే

ఈ నెల 16 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న పరిశీలన, 27 ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి మార్చి 13న పోలింగ్ నిర్వహిస్తారు. 16న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల్లో అధికార వైఎస్సార్‌సీపీకి 85 శాతానికి పైగా స్థానాలు ఉండటంతో రెండు ఎమ్మెల్సీలను వైఎస్సార్‌సీపీ దక్కించుకోవడం లాంఛనమే. కనీస మెజార్టీ లేకపోవడంతో అభ్యరర్థులను పోటీల్లో నిలపడానికి టీడీపీ డైలమాలో పడింది. దీంతో ఎన్నిక లాంఛనం కానుంది. మరోవైపు మరో రెండు రోజుల్లో శాసన మండలికి అభ్యర్థులుగా పార్టీ ప్రకటించిన వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

ఎంపీపీ నుంచి ఎమ్మెల్సీగా

ప్రస్తుత జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఉన్నారు. క్రియాశీలక రాజకీయాల్లోకి బీసీ నాయకుడిగా వచ్చిన కవురు శ్రీనివాస్ 2014 నుంచి 2019 వరకు వైఎస్సార్‌సీపీ నుంచి వీరవాసరం ఎంపీపీగా గెలుపొందారు. ఆచంట నియోజకవర్గ సమన్వయకర్తగా రెండున్నరేళ్ళు, రాజమండ్రి పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేసి గతేడాది యలమంచిలి జెడ్పీటీసీగా గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండటం, బీసీ సామాజిక వర్గం శెట్టిబలిజలో కొంత పట్టు ఉండటం, పార్టీకి పూర్తి విధేయుడిగా ఉండటంతో శాసనమండలి సభ్యుడిగా పిన్నవయస్సులో ఎన్నికయ్యారు. కవురు అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తూ పాలకొల్లులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

పారిశ్రామికవేత్త నుంచి రాజకీయాల్లోకి

స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు తొలితరం ఉద్యమ నేత వంకా సత్యనారాయణ కుమారుడిగా వంకా రవీంద్రనాథ్ క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించారు. వంకా సత్యనారాయణ ఎమ్మెల్యేగా పనిచేశారు. వంకా రవీంద్ర 1989లో తలనీలాలు ఎగుమతి చేసే వ్యాపారాన్ని ప్రారంభించి పదేళ్ళ కాలంలోనే దేశంలోనే వేలాది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. ఉత్తమ చిన్నతరహా జాతీయ ఎగుమతి అవార్డును ఆరు సార్లు తీసుకుని, టెక్స్‌టైల్ రంగంలో ప్రవేశించారు. 2000లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2005లో ఆయన భార్య తణుకు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌సీపీలో క్రియాశీలకంగా ఉంటూ 2014లో నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ రాజమండ్రి పార్లమెంట్ పరిశీలకుడిగా పనిచేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

కొల్లేరు గ్రామం నుంచి... చట్ట సభలకు

కైకలూరు: కైకలూరు మండలం కొట్టాడకు చెందిన జయమంగళ వెంకటరమణ ఆక్వా రైతుగా రాణిస్తున్న సమయంలో ఆయన నాయకత్వంపై నమ్మకంతో జెడ్పీటీసీగా అవకాశం కల్పించారు. 2001 నుంచి 2006 వరకు కైకలూరు జెడ్పీటీసీగా, 2006 నుంచి 2009 వరకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2009 నుంచి 2014 వరకు టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019లో ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతూ ఈ నెల 14న టీడీపీకి రాజీనామా చేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

వంక రవీంద్రనాథ్

పుట్టిన తేదీ: డిసెంబరు 28, 1961
తల్లిదండ్రులు : వంక సత్యనారాయణ, నాగమణి
భార్య : వంక రాజకుమారి
పిల్లలు : వంక రఘువీర్, వంక రవళి
రాజకీయ నేపథ్యం : 2005లో తణుకు 32వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపు, 2014లో నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ, 2022లో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం

కవురు శ్రీనివాస్

పుట్టిన తేదీ : డిసెంబర్ 15, 1978
స్వస్థలం : పెనుమంట్ర మండలం పాలమూరు పంచాయతీ శివారు నాగళ్లదిబ్బ
తల్లిదండ్రులు : కవురు సర్వారావు, సత్యవతి
పిల్లలు : ఇద్దరు అబ్బాయిలు
రాజకీయ ప్రస్థానం : 2014లో వీరవాసరం మండలం నుంచి ఎంపీటీసీగా విజయం, ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జిగా, రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు.. ప్రస్తుతం పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు.. 2020లో డీసీసీబీగా చైర్మన్‌గా ఎంపిక. 2021 సెప్టెంబర్‌లో యలమంచిలి జెడ్పీటీసీగా గెలుపొంది జెడ్పీ చైర్మన్‌గా ఎంపిక.

జయమంగళ వెంకట రమణ

పుట్టిన తేదీ : ఏప్రిల్ 15, 1975
గ్రామం : కైకలూరు మండలం, కొట్టాడ
తల్లిదండ్రులు : బ్రహ్మయ్య, తాయారమ్మ
కుటుంబం : ముగ్గురు పిల్లలు
విద్యార్హత : ఇంటర్మీడియట్
నిర్వహించిన పదవులు : కైకలూరు మండల జెడ్పీటీసీ(2001–2006), టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(2006–2009), కైకలూరు టీడీపీ ఎమ్మెల్యే(2009–2014), నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి(2014–2023)

న్యూస్‌రీల్

స్పందన కేసులు సత్వరం పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 13 మంది అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిప్రకాష్ సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తనకు విశాఖపట్నానికి చెందిన వ్యక్తితో వివాహం కాగా బాబు పుట్టిన తర్వాత భర్త, అత్త మామలు, మరిది అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని భీమవరానికి చెందిన మహిళ కోరింది. తనకు పక్కింటి వారితో గొడవలున్నాయని గతంలో కేసు పెట్టినా మళ్లీ గొడవకు వస్తున్నారని న్యాయం చేయాలని ఇరగవరానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్



వెలవెలబోతున్న శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంపై సోమవారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు కొద్దిపాటి భక్తులతో కనిపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వల్ప సంఖ్యలోనే భక్తులు స్వామివారిని దర్శించారు. దాంతో ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తులు సాధారణంగా ఉన్నారు. మంగళవారం సైతం ఆలయంలో భక్తుల రద్దీ నామమాత్రంగానే ఉండొచ్చని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పట్టిసం కాలినడక మార్గం మూసివేత



పట్టిసం రేవులో కాలినడక మార్గాన్ని మూసివేసిన దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు కాలినడకన భక్తులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పంటి మార్గాన్ని అధికారులు మూసివేశారు. సోమవారం పోలవరం ఎస్సై ఎస్.పవన్‌కుమార్ నడిచివెళ్లే మార్గంలో తడికలతో మూసివేయించారు. పంట్లు కూడా తొలగిస్తున్నారు. రేవులో నుంచి యాత్రికులను పడవపై తరలిస్తామన్నారు.

బాలుర హాస్టల్ ఆకస్మిక తనిఖీ



పిల్లల హాజరు పట్టీ పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): స్థానిక పోలీస్ లైను వెనుక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సోమవారం సాయంత్రం తనిఖీ చేసారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను, వంటశాల, విద్యార్థులు చదువుకునే హాలు పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. టాయిలెట్ రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందజేస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.

స్పందన అర్జీలను ఆడిట్ చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్) : స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారంతో పాటు మండల స్థాయిలో పరిష్కరించిన సమస్యలను పరిశీలించి సక్రమంగా ఉందో లేదో ఆడిట్ చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. భీమవరం జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ సోమవారం విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని క్షుణ్ణంగా చదివి కాలయాపన లేకుండా పరిష్కారం చేయాలన్నారు. మండల స్థాయిలో పరిష్కరించిన సమస్యలను ఓపెన్ చేసి అవి సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి ఆడిట్ చేయాలని కలెక్టరు సూచించారు. స్పందన పరిష్కారానికి జిల్లా మండల స్థాయిలో ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, వాటి ద్వారా పరిష్కారమైన స్పందన సమస్యలు పరిశీలిస్తామని తెలిపారు. అర్జీదారుని స్థానంలో మనం ఉంటే ఏ విధంగా సమస్యకు పరిష్కారం కోరుకుంటామో అదేవిధంగా వారు కూడా కోరుకుంటారని ఆలోచించాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా 142 దరఖాస్తులను స్వీకరించామని కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీల్లో కొన్ని

ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు స్పందనకు వచ్చి తమకు గ్రామంలో డంపింగ్‌యార్డు వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించి ఫొటోలు తీసుకున్నారని.. ఆ స్థలం కోర్టు వివాదంలో ఉందని స్థలాలు మరో చోట చూపించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పోడూరు మండలం వద్దిపర్రు దళితులు ఉండే ప్రాంతంలో రోడ్లను ఆక్రమించుకుంటున్నారని కేసిరాజు స్పందనలో ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక సంస్థల ఎన్నికలకు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో భీమవరం, నరసాపురం డివిజన్ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా దావాలు, అభ్యంతరాల పరిష్కారం, డూప్లికేట్, సందేశాత్మక ఓట్లు, బ్యాలెట్ బాక్సులు, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లాలోని భీమవరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు, నరసాపురం మండలం పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు, భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ తదితర ప్రాంతాల వద్ద నియమ నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాటుకు పోలీస్ అధికారులను ఆదేశించామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వర్తించే చర్యల్లో భాగంగా ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, భీమవరం ఆర్‌డీఓ దాసి రాజు, ఎంసీసీ నోడల్ అధికారి కెసిహెచ్ అప్పారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎం.డి నజీముల్లాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో జాప్యం

నూజివీడు: పురపాలక సంఘాలకు, నగరపాలక సంస్థలకు, నగర పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను. పారిశుధ్యం, వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించాలంటే ఈ నిధులే ఆధారం. ఎంతో కీలకమైన పన్ను వసూళ్ళలో ఏమాత్రం అశ్రద్ధ చూపించినా నిధుల లేమి వల్ల పట్టణంలో రోజువారీ పనులకు ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్ళకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఎరియర్స్‌తో కలుపుకుని పన్ను వసూలు 70 శాతం దాటిన మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ 60.20 శాతం పన్నుల వసూళ్లతో మొదటి స్థానంలో ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు మున్సిపాలిటీ 66 శాతం పన్నులు వసూలు చేసి మిగిలిన మున్సిపాలిటీల కంటే ముందంజలో ఉంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆస్తి పన్ను వసూళ్లు


మున్సిపాలిటీ	డిమాండ్ (రూ.కోట్లలో)	వసూళ్లు (రూ.కోట్లలో)	వసూలు శాతం
ఏలూరు	33.74	16.79	54.3
జంగారెడ్డిగూడెం	7.10	3.92	60.20
నూజివీడు	4.83	2.47	56
చింతలపూడి	2.22	1.15	56.50
భీమవరం	21.35	12.36	63.10
తాడేపల్లిగూడెం	14.61	6.46	48.20
తణుకు	11.80	6.84	63.30
పాలకొల్లు	8.28	3.78	49.80
నర్సాపురం	5.11	2.80	59.80
ఆకివీడు	2.49	1.51	66.10

వారంలోగా అమృత్ సరోవర్ పనులు చేపట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): అమృత సరోవర్ పనులను వచ్చే వారంలోగా చేపట్టని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. సోమవారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి కలెక్టర్ ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అమృత సరోవర్ పనులను చేపట్టడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అలసత్వం కనిపిస్తుందని, వచ్చే వారంలోగా పనులు చేపట్టకపోతే చర్యలకు వెనుకాడేది లేదన్నారు. ఎన్ఆర్‌జీఈఎస్ పనులు కొన్ని గ్రామాల్లో పనులు కల్పించడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయని.. గ్రామాల్లో గుర్తించిన పనులు ప్రతిరోజు జరుగుతుండాలన్నారు. ఇంతవరకు జగనన్న కాలనీ లేఅవుట్లలో లెవలింగ్ పనులు చేపట్టకపోతే వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. రాబోయే ఉగాది నాటికి ఎక్కువ శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీవో ఎం.నాగలత, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నైపుణ్యం సాధించాలి

రోవన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కె.వి.రామానుజాచారి



తాడేపల్లిగూడెం: పోటీప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలని అమెరికాలోని న్యూజెర్సీ రోవన్ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ కేవీ.రామానుజాచారి కోరారు. సోమవారం నిట్‌లోని స్కూల్ ఆఫ్ సైన్స్‌స్ ఆధ్వర్యంలో ఇంటర్‌ప్లే ఆఫ్ స్ట్రక్చర్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రాపర్టీస్ ఇన్ ఆక్సైడ్ విత్ స్ట్రాంగ్ మెటల్ బాండ్స్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామానుజాచారి మాట్లాడుతూ బోధనలకే పరిమితం కాకుండా వినూత్న పరిశోధనలు చేపట్టేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు సైతం తమ పరిశోధనలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమవ్వాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కొత్త ఆలోచనలతో పరిశోధనలు చేసేందుకు ముందుకు వచ్చే విద్యార్థులకు అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాలు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా రామానుజాచారి, విశ్రాంత ఆచార్యులు పి.నాగేశ్వరరావును సత్కరించారు. స్కూల్ ఆఫ్ సైన్స్‌స్ విభాగాధిపతి ఆర్.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.20.14 లక్షల ఆదాయం

ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్



ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల ద్వారా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ శైవ క్షేత్రాలకు తిప్పిన ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ. 20.14 లక్షల ఆదాయం వచ్చిందని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఏలూరు నుంచి బలివే, ద్వారకా తిరుమల నుంచి ఏలూరు, జంగారెడ్డి గూడెం నుంచి పట్టిసీమ, జంగారెడ్డి గూడెం నుంచి తాడువాయి, నూజివీడు నుంచి బలివే శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను భక్తుల సౌకర్యం కోసం తిప్పామన్నారు. ఈ ప్రత్యేక సర్వీసుల ద్వారా 55 వేల మంది భక్తులను ఆయా శైవ క్షేత్రాలకు తీసుకువెళ్ళి వారి గమ్యస్థానాలకు చేర్చామన్నారు. దాదాపు 115 బస్సులను తిప్పడం ద్వారా ఏలూరు జిల్లా ఆర్టీసీకి రూ. 20,14,625 ఆదాయం వచ్చిందని వివరించారు. తమ డ్రైవర్లు చాకచక్యంగా నడిపి భక్తుల మన్ననలు పొందారన్నారు.

సృజనకు పదును

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తికి పదును పెట్టి, వారిలో నైపుణ్యాలకు సాన పెట్టడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సైన్స్ ప్రదర్శనల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అబ్బురపరిచే ప్రాజెక్టులను రూపొందిస్తూ ఔరా అనిపిస్తున్నారు. సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సరికొత్త ఆవిష్కరణలకు రూపమిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే దిశగా విద్యను అభ్యసించడమే కాక భవిష్యత్ తరాల అభ్యున్నతి, దేశ అవసరాలకు కావాల్సిన దార్శనికత వారి నమూనాల్లో ప్రతిబింబిస్తోంది. సోమవారం ఏలూరు కస్తూరిబా నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో ప్రారంభించిన జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో పలువురు విద్యార్థులు ప్రదర్శించిన నమూనాల ద్వారా వారి ప్రతిభ వెలుగు చూసింది. ఈ ప్రదర్శనకు తమ నమూనాలు తీసుకువచ్చిన ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తలా స్ఫురించారు.

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన
- సామాజిక సమస్యలపై విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు
- ఆలోచింపచేసిన సోలార్ విద్యుత్, వ్యవసాయం, నీటి పొదుపు, పర్యావరణ నమూనాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం ఉత్తమ నైపుణ్యాలు సాధించేలా ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మన బడి నాడు – నేడు కార్యక్రమంతో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారు. దీనితో పాటు కార్పొరేట్ విద్యార్థులకు మించి సౌకర్యాలు కల్పిస్తున్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా ప్రభుత్వం అందిస్తున్న విద్యా వస్తువులు, యూనిఫారంతో దొరబిడ్డల్లా బడులకు వస్తున్నారు. ఇదంతా ప్రస్తుతం పైకి కనిపిస్తున్న మార్పు కాగా, అసలైన మార్పు త్వరలోనే ఆవిష్కృతం కానుంది. అదే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మెరుగుదల, దాని ఫలితంగా ఉత్తీర్ణతా శాతం పెరుగుదల. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసి సాన పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం సైన్స్ ప్రదర్శనలను నిర్వహిస్తుండగా, దీనిలో విద్యార్థులు ప్రదర్శించిన కొన్ని నమూనాలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. వాటిలో కొన్ని నమూనాలు ఇలా ఉన్నాయి.



వ్యాక్సిన్ సహిత అరటి పండు ఉత్పత్తి విధానాన్ని ఆవిష్కరిస్తున్న విద్యార్థినిలు

అరటిపండుతో వ్యాక్సిన్ తినేద్దాం

మానవునికి వ్యాధి నిరోధక శక్తి అత్యంత అవసరం . ఇటీవల కరోనా వైరస్ ఎంతోమంది ప్రాణాలను బలిగొంది. ఆ సమయంలో వ్యాధి నిరోధక శక్తి అవసరమనే వాదన బలంగా వినిపించింది. అటువంటి వ్యాధినిరోధక శక్తి మానవ శరీరానికి అందేలా అరటిపండు ఉత్పత్తికి పూనుకున్నారు వేలేరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు డి.మోహన శైలు, కె.కౌసల్య. ఎస్ఏఆర్ఎస్ – సీఓవీ–2 స్పైక్ ప్రొటీన్‌ను స్థిరంగా వ్యక్తీకరించే జీఎం అరటి మొక్కను ఈ విద్యార్థులు అభివృద్ధి చేశారు. అరటి పండ్లలో జన్యువులను మార్చడం ద్వారా తినదగిన వ్యాక్సిన్‌ను తయారు చేయడమే ఈ మొక్కను అభివృద్ధి చేయడానికి ప్రధాన కారణం. కరోనా తరహా వైరస్‌ల నుంచి ఎదురయ్యే సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఈ నూతన జన్యు సహిత అరటి మొక్క అభివృద్ధితో సాధ్యపడుతుంది. వీరికి ఎన్‌వై కిషోర్ నాయక్ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు.

మరింత సమర్థవంతంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి



సోలార్ ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు సామంత్‌కుమార్, నాయక్

సూర్యరశ్మిని మరింత సమర్థవంతంగా వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని నిరూపించారు నూజివీడు మండలం పల్లెర్లమూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వి.సామంత్ కుమార్, బి.మహేంద్ర నాయక్. గతంలో సోలార్ ప్యానళ్లను రూఫ్ టాప్‌లపై బిగించే వారు. సూర్యరశ్మి వాటిపై పడేంత వరకే విద్యుత్‌ను ఉత్పత్తి చేసేవి. ఈ విద్యార్థులు దీనిని మరింత ఆధునికీకరించి సూర్యరశ్మి ఎటువైపు ఉంటే అటువైపుకు సోలార్ ప్యానల్ తిరిగేలా ఏర్పాటు చేశారు. దీనితో సూర్యాస్తమయం సమయంలోనూ విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఏర్పడుతుంది. అలాగే సోలార్ ప్యానల్‌పై పడి పరావర్తనం చెందే సూర్యకిరణాలు మళ్లీ సోలార్‌ప్యానెళ్లపై పడేలా ఇరువైపులా 90 డిగ్రీల కోణంలో అద్దాలను అమర్చడం వారి సృజనలో మరోకోణంగా చెప్పుకోవాల్సిందే. వీరికి స్వర్ణ వెంకటేశ్వరరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు.

పర్యావరణహితంగా..



పర్యావరణ గ్రామం నమూనాతో విద్యార్థిని ఎం.మహేశ్వరి

తాము నివసించే ప్రాంతం పర్యావరణ హితంగా ఉండేలా చేయవచ్చంటూ కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.మహేశ్వరి చెబుతోంది. గ్రామంలో ప్రతి కుటుంబం తమ ప్రాంతాన్ని పర్యావరణ హితంగా మార్చాలనే సంకల్పం కలిగి ఉండాలి. దాని కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేరువేరుగా డీ కంపోజ్ చేయాలి. ఆయా వ్యర్థాలు భూమిలోకి వెళ్లకుండా ప్రత్యేక చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాటిని నాశనం చేయవచ్చు. అలాగే ప్రతి నీటి బొట్టూ పునర్వినియోగమయ్యే ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లల్లో నీటిని వినియోగించిన తరువాత ఆ నీరు మొక్కలకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి. దీంతో పచ్చదనం పెరిగి పర్యావరణానికి ఉపయోగపడుతుంది. ఈ విద్యార్థినికి గైడ్ టీచర్‌గా పి.రాజేశ్వరమ్మ వ్యవహరించారు.

ఎడ్లపై బండి బరువు తగ్గించేలా..



ఎడ్ల బరువును తగ్గించే బండిని రూపొందించిన విద్యార్థిని లక్ష్మీదుర్గ

వ్యవసాయంలో రైతులకు సాయంగా ఉండే ఎడ్లను కూడా మానవతా దృక్పథంతో చూడాలని చెబుతూ వాటిపై పడే అధిక భారాన్ని తగ్గించవచ్చనే ఆలోచన చేసింది కలిదిండి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని డి.లక్ష్మీదుర్గ. ఎడ్లబండిలో వేసిన బరువు ఎడ్లపై పూర్తిగా పడకుండా కనీసం 30 శాతం బరువు తగ్గేలా బండి ముందు భాగంలో గాలితో నిండిన టైరును ఏర్పాటు చేసింది. బండి కాడికి స్పాంజ్ ఏర్పాటు చేసి మెత్తటి స్పర్శతో వాటికి కాస్త ఉపశమనం కలిగే ఏర్పాటు చేసింది. బండి చీకటిలో వెళ్లేటప్పుడు ఎడ్లకు దారి కనిపించేలా బండికి హెడ్‌లైట్ ఏర్పాటు చేయడంతో పాటు మలుపు తిరిగే సమయంలో వెనుకవైపు వారికి తెలిసేలా సైడ్ ఇండికేటర్ లైట్లను కూడా ఏర్పాటు చేసి శభాష్ అనిపించుకుంది.

కాయలను ఇలా మగ్గబెడదాం..



ఇథలీన్ గదుల పెట్టెను చూపిస్తున్న యశ్వంత్

పర్యావరణహితంగా కాయలను మాగబెడదాం అనే నినాదంతో చాటపర్రు హైస్కూల్ విద్యార్థి ఎ.యశ్వంత్ తక్కువ ఖర్చుతో ఇథలీన్ గదుల పెట్టెను రూపొందించాడు. అరటి, మామిడి, బొప్పాయి, దానిమ్మ, యాపిల్, పైనాపిల్, ద్రాక్ష, సపోటా తదితర పండ్లను మాగబెట్టడానికి వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్, పారఫీన్, ఆక్సిటోసిస్, ఇథోఫిన్ వంటి రసాయనాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై పెనుప్రభావం చూపి క్యాన్సర్‌కు దారి తీస్తోంది. దీనిపై అప్రమత్తంగా ఉండి సంచార ఇథలీన్ గదులను వినియోగించడం ద్వారా పండ్లను ఆరోగ్యకర పద్ధతిలో మాగబెట్టవచ్చని ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాడు. యశ్వంత్‌కు ఉపాధ్యాయుడు ఓవీ ధనుంజయరావు గైడ్‌గా వ్యవహరించారు.

నైపుణ్యానికి కొదవలేదు



విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేలా గైడ్ టీచర్లు విశేషంగా ప్రోత్సహిస్తున్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో నిబిడీకృతమైన ఆలోచనలకు రూపం లభిస్తోంది. పర్యావరణంపై వారికున్న ప్రేమ, పరిశోధనలపై వారికున్న ఆసక్తి ఈ ప్రదర్శనలో ప్రస్ఫుటంగా కనిపించింది. అలాగే కంప్యూటర్‌లు, సాంకేతిక పరిజ్ఞానం, యాప్‌ల రూపకల్పనలో సైతం విద్యార్థులు పట్టుసాధిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ విద్యార్థుల నుంచి జాతికి ఉపయోగపడే ఆవిష్కరణలు లభించే అవకాశం ఉంది.

– సీహెచ్ ఆర్ఎం చౌదరి, జిల్లా సైన్స్ అధికారి

క్లుప్తంగా

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 2,047 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ప్రయోగ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 2317 మంది హాజరు కావాల్సి ఉండగా 270 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,191 మందికి గాను 1,014 మంది హాజరు కాగా 177 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,126 మందికి గాను 1,033 మంది హాజరు కాగా 93 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఓ లాడ్జిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన కందుల శ్రీనివాసరెడ్డి (45) ఆదివారం రాత్రి పట్టణంలోని ఒక లాడ్జిలో రూమ్ తీసుకుని నిద్రపోయారు. ఉదయం లాడ్జి సిబ్బంది గమనించగా, అతని చనిపోయి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. టుటౌన్ ఎస్సై అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్నేహితుడు బి.శ్రీనివాసవరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సుగర్ ఇండస్ట్రీ వర్క్‌షాప్ పుస్తకావిష్కరణ



హైదరాబాద్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం, చిత్రంలో జేఎండీ నరేంద్రనాథ్

తణుకు: తణుకు ఆంధ్రా సుగర్స్ సంస్థ ఆధ్వర్యంలో మై ప్రెజెంటేషన్స్ ఎట్ సుగర్ ఇండస్ట్రీ వర్క్‌షాప్, కాంగ్రెస్ అనే పుస్తకాన్ని సోమవారం హైదరాబాదులో ఆవిష్కరించారు. 1978 నుంచి ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో చక్కెర పరిశ్రమకు సంబంధించిన వర్క్‌షాప్, కాంగ్రెస్‌లలో సమర్పించిన పరిశోధన పత్రాలు ఆధారంగా భావితరాల సుగర్ టెక్నాలజిస్టులకు ఉపయోగపడేలా ఈ పుస్తకాన్ని ముద్రించినట్టు ఆంధ్రా సుగర్స్ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన 31వ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ సుగర్ కేన్ టెక్నాలజిస్ట్స్ (ఐఎస్ఎస్‌సీటీ) కాంగ్రెస్ సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ అవస్థి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేంద్ర ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ జాయింట్ సెక్రటరీ సుబోధ్‌కుమార్ సింగ్, ఐఎస్ఎస్‌సీటీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ రౌల్ క్యాస్టిల్లో, జనరల్ సెక్రటరీ డాక్టర్ జీన్‌క్లాడ్ ఆట్రీ, చైర్మన్ ఆఫ్ ఆర్గనైజింగ్ కమిటీ రంజిత్ పూరీ, డైరెక్టర్ ఆఫ్ నేషనల్ సుగర్ ఇనిస్టిట్యూట్ కాన్పూర్ ప్రొఫెసర్ నరేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ: రామన్నపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



భీమవరంలో బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: 13వ జూనియర్స్ మిస్టర్ ఇండియా 2023 సెలెక్షన్స్ ట్రైలర్ ఫర్ ఆంధ్ర టీం అండ్ వెస్ట్ గోదావరి, ఏలూరు డిస్ట్రిక్ట్ బాడీ బిల్డింగ్ పోటీలు, మిస్టర్ భీమవరం ఫిజిక్ మోడలింగ్ పోటీలు కె12, వై5 జిమ్ నేతృత్వంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించినట్లు షేక్ ఖాసిం సోమవారం చెప్పారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ మహిళా కన్వీనర్ గూడూరి ఉమాబాల, జగదీష్ దంపతులు ప్రారంభించారు. ఈ పోటీల్లో 55 కేజీల విభాగంలో ఎస్‌కే జాఫర్, కేవీవీ సత్యనారాయణ (తూర్పుగోదావరి), 60 కేజీల విభాగంలో సీహెచ్ రవికుమార్ (తూర్పుగోదావరి), 65 కేజీల విభాగంలో కె.గణేషసాయి (గుంటూరు), జేపీ దుర్గాప్రసాద్ (కాకినాడ), 70 కేజీల విభాగంలో వి.అశోక్‌కుమార్ (ఏలూరు), ఎం.శివగణేష్ (మండపేట), 75 కేజీల విభాగంలో వి.మహేష్ (రామచంద్రపురం), సీహెచ్ గోపిచంద్ (కృష్ణ) విజేతలుగా నిలిచారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డి జానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట భోగయ్య, గోగులమండ రాజేషకన్నా, బొల్లా శ్రీనివాస్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కఠారి రవిశంకర్, అల్లు శ్రీనివాస్, షేక్ ఖాజీ, షేక్ మీరా సాహెబ్, కొక్కిరి చిట్టిబాబు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్టు.. 28 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసు అధికారులు

కాకినాడ క్రైం: ద్విచక్రవాహనాల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకుని, అతని నుంచి 28 బైక్‌లు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ కేసు వివరాలు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన కోరాడ వెంకటేశులు ద్విచక్రవాహనాల చోరీలో ఆరితేరాడు. గతంలో 45 బైకుల చోరీ కేసులో అరెస్టయ్యాడు. ఐదు నెలల క్రితమే జైలు నుంచి విడుదలైన అతడు.. తదనంతరం కాకినాడ, మండపేట, కడియం, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పెదపూడి పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. అతడి కదలికలపై నిఘా పెట్టిన సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) ప్రత్యేక బృందాలు వివిధ ప్రాంతాల్లో అతడు 28 బైకులు కొట్టేశాడని నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేశులును సోమవారం కాకినాడలో అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. చెడు వ్యసనాలకు బానిసైన నిందితుడు దొంగతనాలకు అలవాటు పడ్డాడన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో సీసీఎస్ డీఎస్పీ ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతి బృందం కీలకంగా వ్యవహరించిందని తెలిపారు. ఐటీ కోర్ సాంకేతిక సాయంతో నిందితుడి జాడ తెలుసుకున్నామని చెప్పారు. ఎస్బీ డీఎస్పీ అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు.. రూ.2.13 లక్షల నగదు స్వాధీనం

ఆకివీడు: దుంపగడపలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,13,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రాజారెడ్డి సోమవారం చెప్పారు. వారి నుంచి 52 పేక ముక్కలు, నాలుగు మోటారు సైకిళ్లు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు నిల్

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయని, నామినేషన్‌ల దాఖలుకు ఈనెల 23వ తేదీ ఆఖరు అని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

లింగపాలెం: ధర్మాజీగూడెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ధర్మాజీగూడెంకు చెందిన ఇద్దరు విద్యార్థినులు స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. సోమవారం ఇంటి నుంచి వీరు హైస్కూల్‌కు వెళ్లగా, మధ్యాహ్నం భోజనం సమయం నుంచి స్కూల్‌లో కనిపించలేదు. దీంతో హెచ్‌ఎం వీఎస్‌వీ శ్రీలక్ష్మి స్కూల్ చుట్టుపక్కలు బాలికలు కోసం ఆరా తీసినా కనిపించకపోవటంతో బాలికల తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు. ఈ మేరకు హెచ్‌ఎం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.చెన్నారావు కేసు నమోదు చేసి సిబ్బందితో విద్యార్థినుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి



దుర్గా ప్రసాద్ (ఫైల్)

గండేపల్లి: జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి చెందాడు. గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం నుంచి కోల్‌కతాకు కోడిగుడ్ల లోడుతో లారీ వెళుతోంది. మండలంలోని మురారి గ్రామ శివారు న్యూ అన్నపూర్ణ హోటల్‌లో భోజనం చేసేందుకు లారీ ఆపగా, ఎదురుగా ఉన్న పాన్‌షాప్ వద్దకు వెళ్లేందుకు క్లీనర్ మాదాసు దుర్గాప్రసాద్ (32) రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు. దుర్గాప్రసాద్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చిత్రలేఖనం పోటీల్లో తణుకు విద్యార్థినులకు పతకాలు



మెడల్స్ సాధించిన విద్యార్థినులతో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తణుకు టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన చారు కేస్టిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం జూలైలో నిర్వహించిన అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీలలో తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ సోమవారం చెప్పారు. సంస్కృతి కి రంగ్ పేరుతో నిర్వహించిన ఈ పోటీలలో పాల్గొన్న కళాశాల విద్యార్థినులు 11 మందికి పతకాలు, ప్రశంసాపత్రాలు పొందినట్లు తెలిపారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, కె పద్మజారాణి అభినందించారు.

ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల జట్లను ఎంపిక చేసినట్లు ఆర్చరీ కోచ్ ఎల్.జయరాజు సోమవారం చెప్పారు. జంగారెడ్డిగూడెంలోని వోల్గా ఆర్చరీ అకాడమీలో ఆదివారం సీనియర్ పురుషుల, మహిళల ఆర్చరీ సెలెక్షన్స్ నిర్వహించామని, దీనిలో ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28, మార్చి 1, 2 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

- కాంపౌండ్ కేటగిరిలో పురుషుల విభాగంలో ఎం.సుహాస్, టి.గణేష్ మణిరత్నం, ఎల్.చేగువేర, మహిళల విభాగంలో ఎం.సూర్యహంసిని, కె.శరణ్య, ఆర్.రూపాచంద్రహాసిని, కె.సుస్మిత, ఎ.కనిష్క ఎంపికయ్యారు.
- రికర్వ్ కేటగిరిలో పురుషుల విభాగంలో ఎల్.స్టాలిన్, ఎస్.జగదీష్‌రాజా ఎంపిక కాగా, మహిళల విభాగంలో ఎవరూ అర్హత సాధించలేదు.
- ఇండియన్ రౌండ్ కేటగిరిలో పురుషుల విభాగంలో జె.ప్రణీత్ సువర్ణ రత్న, టి.అజయ్, మహిళల విభాగంలో ఎం.జాహ్నవి కనక మహాలక్ష్మి, ఎం.జాహ్నవి, బి.గాయత్రివల్లి, పి.శృతి, ఎం.మాధవి ఎంపికయ్యారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



ఇరగవరం మండలంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



ఆర్‌అండ్‌బి రోడ్డు మార్జిన్ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

- ఇక రాకపోకలు సులభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇరగవరం: మండలంలో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం రోడ్డులు సరిగా వేయాక పోవడం, రోడ్డులు నాసిరకంగా వేయడంతో రోడ్డులన్నీ ఎక్కడికక్కడ పూర్తిగా పాడైపోయాయి. దీంతో వైఎస్సార్ సీపీ మరమత్తులు చేయించడం జరిగింది. అయినప్పటికి ప్రయోజనం లేకపోవడంతో, తణుకు నియోజకవర్గంలో ఇరగవరం, రేలంగి, ఏలేటిపాడు, పెనుగొండ, జుత్తిగ, గోటేరు, వేల్పూరు, తణుకు ఆర్‌అండ్‌బి పరిధిలో పలు గ్రామాల్లో సీసీ, తారు రోడ్డు నిర్మాణ పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. సిద్ధాంతం జుత్తిగ రోడ్డు రూ. 40 లక్షలతో మరమత్తులు చేయడం జరుగుతుంది. ఇరగవరం నుంచి తణుకు వెళ్లే రోడ్డును 7 మీటర్లు వెడల్పు చేసి 2 కి.మీ. న్యూ డవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డిబి) నిధులు రూ. 2.50 కోట్లతో 400 మీటర్లు సీసీ రోడ్డు, 1600 మీటర్లు తారు రోడ్డు వేయడం జరుగుతుంది. ఈ పనులన్నీ ఒక నెలలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇరగవరం మండలం రేలంగి నుంచి అత్తిలి మీదగా భీమవరం వైపున్యూ డవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో సుమారు 25 కోట్ల రూపాయాలతో సీసీ, తారు రోడ్డు పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తి అయ్యింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఇరగవరం మండలంలోని ఏలేటిపాడు వంతెన వద్ద 1.50 కోట్లతో, టెండర్లు పూర్తి అయ్యాయి. అదే గ్రామంలో మంజురైన 3 కోట్ల రూపాయాల రోడ్డుకు టెండర్లుకు కాంట్రక్టర్లు రావాల్సి ఉంది. గ్రామాల్లో పెద్ద ఎత్తున రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 60 కోట్లతో సీసీ, తారు రోడ్డు నిర్మాణ పనులు



ఇరగవరం పరిసర ప్రాంతాల్లో న్యూ డవలప్‌మెంటు బ్యాంకు నిధులతో 25 కోట్లు టెండర్ పూర్తి కాగా మరో నెలలో పనులు ప్రారంభమవుతాయి. పెనుగొండ మండలంలో రెండు రోడ్లు పనులు జరుగుతున్నాయి. వాటిని 15 కోట్ల రూపాయాలతో నిర్మించడం జరుగుతుంది. ఈ పనులు కొన్ని పనులు జరుగుతున్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈపనులు మరోక నెలరోజుల్లో పూర్తిఅవుతాయి.

– ఎస్ సాంబశివరావు, తణుకు ఆర్‌అండ్‌బి డీఈ

రోడ్డు పనులపై హర్షం



గత ప్రభుత్వంలో రోడ్లు సరిగా వేయకపోవడంతో రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. దీంతో రోడ్లు పెద్ద ఎత్తున వేయడం జరుగుతుంది. ప్రభుత్వం నిధులు మంజురు చేస్తుంది. 2.50 లక్షలతో దాని నిర్మాణం చేపట్టడం ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– మల్లిరెడ్డి నాగార్జున, కె ఇల్లిందల పర్రు, సొసైటి అధ్యక్షుడు

రోడ్డు నిర్మాణానికి మంత్రి కారుమూరి కృషి అభినందనీయం



25 కోట్ల రూపాయాలతో రేలంగి నుంచి భీమవరం వైపు వెళ్లే రోడ్డు నిర్మాణం చేయడం ఎంతో అభినందనీయం. దీనికి రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కృషి వల్ల సాధ్యమైందన్నారు. తణుకు నియోజక వర్గం నుంచి ప్రజలు జిల్లా కేంద్రం భీమవరం వెళ్లాలి అంటే ఈ రోడ్డునే ఎక్కువగా వినియోగిస్తారు. ఎట్టకేలకు రోడ్డు మరమత్తులు ప్రారంభం కావడంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పులుపు అనిల్, రేలంగి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం: సీజనల్ వ్యాధులను అరికట్టడానికి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు కోరారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల నుంచి వచ్చే వ్యాధులను తరిమికొట్టవచ్చని తెలిపారు. ఫీవర్ సర్వే , కీటక నియంత్రణ చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దోమలు కుట్టకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. తొమ్మిది, పది,11, 12 వార్డుల్లో కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో వార్డుల ఆరోగ్యకార్యదర్శులు వెంకటలక్ష్మి, మేరీ, పోశమ్మ, మంగతాయారు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు చిర్ల పుల్లారెడ్డి

తాడేపల్లిగూడెం: సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సోమవారం రైల్వే గూడ్సుషెడ్‌లో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో యూనియన్ నాయకులు సత్తి కోదండ రామిరెడ్డి, చిర్లపుల్లారెడ్డి తదితరులు పిలుపునిచ్చారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్న అన్ని సంస్థలను భ్రష్టు పట్టించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ సంస్థలకు దారాదత్తం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టామని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కర్రి సుబ్బిరెడ్డి, కర్రి సాయిరెడ్డి, ఆకుల నారాయణ, బుద్దాల నాని, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రతినెలా వేతనాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం: కార్మికులకు ప్రతినెల వేతనాలివ్వాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కూరగాయలు మార్కెట్ జట్టు వర్కర్సు యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక రైతులు, కార్మికుల మీద దాడులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పైలు పైడియ్య, మూడెడ్ల వెంకటరావు, సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి తదతరులు మాట్లాడారు. నూతన కమిటీకి అధ్యక్షునిగా గొర్రెల సతీష్‌ను, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

యువత చెడును ఎదుర్కొంటూ ఎదగాలి



వికాసతరంగిణి కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణమూర్తి

తాడేపల్లిగూడెం: యువత చెడును ఎదుర్కొంటూ ఎదగాలని వికాసతరంగణి ఆధ్వర్యంలో సోమవారం మాగంటి కల్యాణ మండపంలో జరిగిన యువవికాస్ శిక్షణా కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ బాధ్యులు రమణమూర్తి పిలుపునిచ్చారు. మానవ జీవితంలో యుక్త వయస్సు అత్యంత కీలకమైందని, స్వార్థం లేకుండా ఆలోచనలు సాగే ఆ వయస్సును సద్వినియోగం చేసుకొని ఎదగాలని, ధర్మబద్ధమైన జీవనాన్ని, మోసం కపటం, అధర్మం వంటి చెడును ఎదుర్కొంటూ సమాజసేవ ఎలా చేయాలో పలువురు వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంకాల రమణమూర్తి, గట్టిం మాణిక్యాలరావు, చిట్యాల సురేంద్రకుమార్, ఆర్‌కె.కుమార్, అడ్డగర్ల తులసీ, శశి, వాసవీ ఇంజనీరింగ్, ఆదిత్య, ప్రగతి, వాసవీ డిగ్రీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు.

నేడు ప్రకృతి విపత్తులపై అవగాహన సదస్సు

మొగల్తూరు: ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంగళవారం కేపీ పాలెం బీచ్‌లో ఎన్‌ఆర్‌ఎఫ్ బృందం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జి.అనిత కుమారి తెలిపారు.

బాలికలు ఉన్నత పదవులు అధిరోహించాలి



బాల్యవివాహాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

అత్తిలి: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామ సచివాలయంలో సోమవారం బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ముందుకువెళ్లి, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్యవివాహాలవల్ల కలిగే దుష్పరిణామాలు, బాల్యవివాహ నిర్మోధకచట్టం 2006, పోక్సో చట్టం 2012, పోక్సో సవరణచట్టం 2019పై అవగాహన కల్పించారు. కౌమార పిల్లల మానసిక, శారీరక స్థితులను వివరించారు. పంచా యతీ సెక్రటరీ ఫణిరాజు, వీఆర్వో వెంకటేశ్వరరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్, ఏఎస్ఎం వీరలక్ష్మి, మహిళా సంరక్షణాధికారిణి స్వప్న, అంగన్‌వాడీ, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పెనుగొండ: వసుధ ఫౌండేషన్, మణిపాల్ ఆసుపత్రి నిర్వహణలో పెనుగొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెనుగొండలో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు పెనుగొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెనుగొండ బస్టాండ్ వద్ద టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జగ్గన్నపేటలో కేంద్ర ఆడిట్ బృందం పర్యటన



తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో సోమవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్లపై కేంద్ర ఆడిట్ బృందం సభ్యులు పరిశీలన చేశారు. 2016 నుంచి 2018 సంవత్సరాల్లో నిర్మించిన ఇళ్లను ఈ బృందం సభ్యులు పరిశీలించి ఏయే దశల్లో ఉన్నాయనే వివరాలు నమోదు చేసుకున్నారు. మొత్తం 17 ఇళ్లు మంజూరు కాగా, 11 ఇళ్లు పూర్తయ్యాయని, ఆరు ఇళ్లు శ్లాబ్ దశలో ఉన్నాయని గుర్తించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఏఈ టివి.వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కె.నాగేశ్వరరావు, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, పంచాయతీ కార్యదర్శి వి.బాలకృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుద్దాల వెంకటరామారావు

తాడేపల్లిగూడెం అర్బన్: కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బివిఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు పేర్కొన్నారు. నెలావారీ కార్యాక్రమాన్ని స్థానిక బివిఆర్ కళా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎ రమేష్ నిర్వహించిన ఫ్లూట్ గిటార్ వాయిద్యాలు అలరించాయి. కృష్ణ ప్రశాంతి బడుగు చంద్రశేఖర్ మాసా బాబూరావు ప్రకాష్ ఆలపించిన గీతాలు వీనులవిందు చేశాయి. మునిపల్లె విద్యాధరరావుకు ఆర్థిక సత్కారం అందించారు. ఈ సందర్భంగా లయన్ కోనా శ్రీనివాసరావు దంపతులకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, యెగ్గిన నాగబాబు, లలిత కళల అకాడమి రాష్ట్ర డైరెక్టర్ మానుకొండ వెంకటేశ్వరరావు, సీమకుర్తి రాజా, మండవల్లి చెన్నా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : పట్టణంలోని మారుతీ నగర్ మునిసిపల్ పార్క్‌ను మునిసిపల్ స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని పురపాలక సంఘం అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం మారుతీ నగర్ మునిసిపల్ పార్క్‌ను కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. పురపాలక సంఘం బడ్జెట్‌లో కొంత కేటాయింపుతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు సాయంతో సుందరవనంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా యువతీ, యువకులకు ఆట, పాటలతో పాటు మార్నింగ్ వాక్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. పార్క్‌కు వచ్చే వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఎక్కడా శానిటేషన్ లోటు లేకుండా చూడాలని, మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లా కలెక్టరు వెంట పురపాలక సంఘం కమిషనర్ యస్.శివ రామకృష్ణ, ఈఈ విజయ్, ఏసీపీ గౌరు, తదితరులు పాల్గొన్నారు.

సాహస బాలల అవార్డు గ్రహీత వినూత్నకు సన్మానం



భీమవరం డీఎన్నార్ స్కూల్లో వినూత్నను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : స్థానిక డీఎన్నార్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి వినూత్న జాతీయ సాహస బాలల అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం, డీఎన్నార్ స్కూల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ స్కూల్ జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు మాట్లాడుతూ తమ పాఠశాలలో పదవ తరగతి చదివిన వినూత్న జాతీయ సాహస బాలల అవార్డుకు ఎంపిక కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం వినూత్నకు జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకుమారి, నిర్మల, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని ఆందోళన

ఉండి : చెరుకువాడలో వరి చేలకు సాగునీరు అందించాలని కోరుతూ గ్రామానికి చెందిన కొందరు రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో తోరణాల కోడు, కోలనపల్లి కాలువ తదితర ప్రాంతాలకు వంతుల వారీ విధానంలో వరిచేలకు సరైన సాగునీరు అందడం లేదన్నారు. వరిచేలు చిరుపొట్టదశలో ఉండగా ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడులు పెట్టామని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరు అందించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మద్దాల గంగయ్య, పడమటి త్రిమూర్తులు, జి.నాగరాజు, పి.సూర్యనారాయణ, హరి, రమేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యంతో రోగాలు నయం

నరసాపురం రూరల్: మందుల వినియోగం పెరగడం వల్ల రోగులు వారికి సంక్రమించిన రోగంతో పాటు భవిష్యత్తులో ఇతర రోగాల బారినపడే ప్రమాదం ఉందని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్న విషయాన్ని గమనించాలని కొవ్వలి ఫౌండేషన్ ట్రస్టు కార్యదర్శి కొండా శ్రీధర్ అన్నారు. నరసాపురం మండలంలోని గొంది గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మద్దాల శ్రీకృష్ణ ఆంజనేయులు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యులు అన్నపూర్ణ, అలేఖ్య, అనిత, హరిణి, రామారావు, భవాని కుమార్ సుబ్రహ్మణ్యం , హారిక తదితరులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంక రవీంద్రకు అభినందనలు



వంక రవీంద్రనాథ్‌కు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, వైఎస్సార్సీపీ నాయకుడు, రాష్ట్రర ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ స్థానిక సంస్థల కోటాలో శాసన మండలి సభ్యుడుగా ఎంపిక కావడం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. పారిశ్రామికవేత్త వంక రవీంద్రనాథ్‌కు ఎమ్మెల్సీ సీటు ప్రకటించడంతో తేతలి ఇండస్ట్రీయల్ ఎస్టేట్ వద్ద రవీంద్రనాథ్ అభిమానులు, సిబ్బంది బాణా సంచాల కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అలాగే పైడిపర్రు సర్కిల్ వద్ద బాణా సంచా కాల్చి తమ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలుపుతూ రవీంద్రనాథ్‌కు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. సోమవారం రాత్రి తణుకు సజ్జాపురంలోని వంక రవీంద్రనాథ్ నివాసంలో పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, లయన్స్ నాయకులు కలసి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ములగాల శ్రీనివాసు, నాయకులు కంచుమర్తి విశ్వేశ్వరరావు, రాంబాబు, బడేటి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ నాయకులు వై నాగరాజ్‌కుమార్, చిట్టూరి శ్రీనివాస్, గుండుగొలను వివేకానంద స్వామి, గాజుల పుల్లారావు, సత్యనారాయణరెడ్డి, ఈశ్వరరరావు, రవికాంత్, తదితరులు వంక రవీంద్రనాథ్‌కు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

ఆలయాలను దర్శించిన పూరీ జగన్నాథ్ కుటుంబం

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన సినీ దర్శకులు పూరీ జగన్నాథ్ భార్య లావణ్య, కూతురు పవిత్ర ఆలయాలను దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని, పంచారామక్షేత్రం శ్రీఉమాసోమేశ్వరస్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల ధర్మకర్తలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కాళ్ల: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జువ్వలపాలెం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సుమారు 180 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ జి.వినోద్ రంగరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 108 వేమన పద్యాల ఆలాపన



దేశ నాయకుల వేషధారణలో వేమన పద్యాలు ఆలపిస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్: వేమన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన సందర్భంగా మాతృభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 5 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులతో వేమన శతకంలోని 108 పద్యాల రాగయుక్తంగా ఆలపించే కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. తణుకులో స్వర్ణ క్లబ్, హిందీ పండిట్ సీహెచ్‌వీఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 5 వేల మంది దేశ నాయకుల వేషధారణలో పాల్గొని వేమన పద్యాలను ఆలపించారు. స్వర్ణ క్లబ్ నాయకురాలు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వేమన పద్యాలు, సమాజ హితం, నైతిక విలువలు బోధించేవని చెప్పారు. పండిత, పామరులకు అర్థమయ్యే రీతిలో యోగి వేమన తన పద్యాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారని చెప్పారు. మాతృభాషా సంరక్షణ సంస్థ గౌరవ అధ్యక్షుడు కొచ్చర్ల ప్రసాద్, అధ్యక్షులు చర్ల సుభాష్‌చంద్రబోస్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ తాడేపల్లి వీరలక్ష్మీ, కార్యదర్శి ఓలేటి నారాయణకుమార్, స్వర్ణ క్లబ్ సభ్యులు బూరుగుపల్లి వెంకట్రావు, బూరుగుపల్లి లలిత పాల్గొన్నారు.

డీఎన్నార్ పాలకవర్గ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

సాక్షి, భీమవరం : భీమవరం డీఎన్నార్ కళాశాల పాలకవర్గ ఎన్నికలకు సోమవారం ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదలైంది. కళాశాల ఎన్నికల అధికారి డాక్టర్ కె.రఘురామ్ ఎన్నికల షెడ్యూల్‌ను విలేకర్లకు తెలియజేశారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉండే పాలకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల కోసం ఈనెల 24వ తేది ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్స్ ప్రతాలను కళాశాల అడ్మినిస్ట్రేటివ్ భవనంలో పొందవచ్చన్నారు. మార్చి 2, 3 తేదీల్లో నామినేషన్లు స్వీకరణ, 4న నామినేషన్ల పరిశీలన, 5, 6 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణకు గడువు, 7వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడి, 24న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్లు లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారి రఘురామ్ వెల్లడించారు. కళాశాలలో 4,774 మంది ఓటర్లు ఉండగా కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 13 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎన్నికైన సభ్యుల నుంచి మిలిగిన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తారు. ఎన్నికల్లో పోలింగ్‌కుగాను 18 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేయనున్నట్లు ఆయన చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా, సహజవుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి రఘురామ్ చెప్పారు.

దాడిపై కేసు నమోదు

పాలకోడేరు: పాత గొడవలను పురస్కరించుకుని తనపై కొంతమంది దాడి చేశారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరసాపురంలోని 31వ వార్డుకు చెందిన రెండు వర్గాల వారికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 15వ తేదీన శృంగవృక్షం గ్రామంలో జరిగిన పెళ్లికి ఇరువర్గాలు హాజరయ్యాయి. రాత్రి పదిన్నర గంటలకు రిసెప్షన్ జరుగుతుండగా ఒక వర్గానికి చెందిన బళ్ల రమేష్ మరో ముగ్గురు కలిసి తనను చేతులతో కొట్టి చంపుతానని బెదిరించి అక్కడున్న ఆడవాళ్లను అసభ్యకరంగా సైగలు చేసి దాడి చేశారని అడబాల ఉమా మహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి తన మనమరాలు అదృశ్యమైందని తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కొండేపూడికి చెందిన నాగేశ్వరరావుకు ఇంటర్ చదివిన కుమార్తె ఉండగా, ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. ఈనెల 19న రాత్రి బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని తాత మైగాపుల గణపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు.